సాక్షి
నిర్మల్
సోమవారం : 24 : ఫిబ్రవరి : 2025



బాసరలో భక్తుల రద్దీ 8లో▸

బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వివిధ సేవల ద్వారా అమ్మవారికి ఒక్కరోజే రూ.15.46 లక్షల ఆదాయం సమకూరింది.



సొంత భవనాలేవి? 9లో▸

చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. సొంత భవనాలు నిర్మించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కోరుతున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.0 / 19.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు మంచిర్యాలకు సీఎం



సాక్షి ప్రతినిధి మంచిర్యాల: ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మంచిర్యాలకు రానున్నారు. ఉదయం 11 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరుతారు. 11.45 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుని అక్కడ 11.50 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి 2.15 గంటలకు మంచిర్యాలకు వచ్చి 2.20 నుంచి 3.55 వరకు సభకు హాజరవుతారు. సీఎంతోపాటు మంత్రులు, రాష్ట్రస్థాయి నాయకులు సభకు హాజరుకానున్నారు. ఈ సభకు 12వేల మంది పట్టభద్రులను తరలించేలా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు సమీప ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పట్టభద్రులను సభకు రప్పించే ఏర్పాట్లు చేశారు. సీఎం సభ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతోపాటు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. డీసీపీ భాస్కర్ నేతృత్వంలో సభాస్థలి, పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నిర్మల్ పర్యటన రద్దు

నిర్మల్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్మల్ పర్యటన రద్దయినట్లు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు గమనించాలని సూచించారు.

గజ్జలమ్మకు ప్రత్యేక పూజలు



మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ధర్మాబాద్, బోకర్ తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఆలయానికి వచ్చారు. అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, సినీగేయ రచయిత తాటి శివ ఆధ్వర్యంలో పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అడెల్లిలో భక్తుల సందడి



ఆలయం ఎదుట పూజలు చేస్తున్న భక్తులు

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు పొరుగు జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ ఈవో రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

టమాటా ధర ధమాల్




కుంటాల సంతలో టమాటాలు

కుంటాల: మార్కెట్‌లో టమాటా ధర రోజురోజుకూ పడిపోతోంది. ఆదివారం కుంటాల సంతలో రూ.2.50కి కిలో చొప్పున విక్రయించారు. ప్రస్తుత సీజన్‌లో దిగుబడి ఎక్కువగా రావడంతో ధర తగ్గింది. దీంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు.

భళా.. బాలశక్తి



మామడలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)



- కలెక్టర్ చొరవతో ప్రత్యేక కార్యక్రమం
- సక్సెస్ కావడంతో సర్వత్రా హర్షం
- విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

జిల్లాలోని స్కూళ్లలో ఆరోగ్య పరీక్షలిలా..
ఎంపిక చేసిన పాఠశాలలు : 57
మొత్తం విద్యార్థుల సంఖ్య : 20,082
పరీక్షలు చేయించుకున్నవారు : 17,545
నమోదైన రక్తహీనత కేసులు : 384
రిఫ్రాక్టివ్ లోపాలున్నవారు : 892
నమోదైన థైరాయిడ్ కేసులు : 180

భైంసాటౌన్: విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా జిల్లాలో కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నారు. బాలశక్తి పేరిట రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్య, వైద్య, వైజ్ఞానిక, ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. గత సెప్టెంబర్ నుంచి జిల్లాలో కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 20వేల మంది విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించారు. వారికి అవసరమైన చికిత్సను వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్నారు. బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన, ప్రభుత్వ కార్యాలయాలు, ఇండస్ట్రీల సందర్శన ద్వారా వారికి అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం సత్ఫలితాలనిస్తుండడంతో ప్రభుత్వ సీఎస్ కలెక్టర్‌ను ప్రత్యేకంగా ప్రశంసించినట్లు తెలిసింది. దీంతో ఆమె జిల్లాలో కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులను అభినందించారు.

విస్తృతంగా వైద్య పరీక్షలు

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపడంలో భాగంగా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విస్తృతంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల ఆరోగ్య ప్రొఫైల్ రూపొందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 57 విద్యాసంస్థల్లో వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, థైరాయిడ్, తక్కువ బరువు, ఊబకాయం, విటమిన్ లోపాలున్నవారిని గుర్తించి చికిత్స అందిస్తున్నారు. పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థినుల్లో రుతు సంబంధ సమస్యలుంటే గుర్తించి అవగాహన కల్పిస్తున్నారు. అలాగే విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, లోపాలున్నవారికి కంటి అద్దాలు అందిస్తున్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా సైకియాట్రిస్ట్‌తో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు.

కార్యక్రమ ఉద్దేశం..

ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే గ్రామీణ ప్రాంత నిరుపేద కుటుంబాల బాలబాలికలకు భద్రతతోపాటు భవిష్యత్‌పై నమ్మకం కలిగించేలా నాలుగు అంశాలతో కార్యక్రమానికి రూపకల్పన చేశారు. విద్య, వైద్యం, ఆర్థిక అక్షరాస్యత, నైపుణ్యాభివృద్ధి, సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం కార్యక్రమ ఉద్దేశం. ముందుగా ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలు చేసి, మున్ముందు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు విస్తరించే ఆలోచనతో కలెక్టర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

వివిధ అంశాలపై అవగాహన

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా పొదుపు బ్యాంక్ ఖాతాలు, నమూనా బ్యాంకింగ్, పిల్లల ద్వారా తల్లిదండ్రులకు ఆర్థిక నిర్వహణపై అవగాహన కల్పించడం, పొదుపు అలవాట్లను నేర్పించడం, సైబర్ భద్రతపై అవగాహన, కిడ్డీ బ్యాంక్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నైపుణ్యాభివృద్ధిలో భాగంగా నెక్ట్స్ స్కిల్స్ 360 ఎడ్యుటెక్ సహకారంతో జిల్లావ్యాప్తంగా 48 విద్యాసంస్థల్లో 8,9,10 తరగతుల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సామాజిక సంస్థల సందర్శనలో భాగంగా విద్యార్థులకు బ్యాంకులు, పోస్టాఫీసులు, పోలీస్‌స్టేషన్, అగ్నిమాపక కేంద్రాలు, కోర్టులు, గ్రామపంచాయతీ, మండల కార్యాలయాలు, పీహెచ్‌సీలు, మీసేవలు, చిన్న తరహా పరిశ్రమలు, నీటిపారుదల ప్రాజెక్టులు, వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనతో వాటి కార్యకలాపాలపై అవగాహన పెంచుతున్నారు.

20వేల మందికి పరీక్షలు



బాలశక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 20వేల మందికిపైగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, హెల్త్ కార్డులు రూపొందించాం. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో పకడ్బందీగా దీన్ని అమలు చేస్తున్నాం. విద్య, వైద్యం, నైపుణ్యం, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– అభిలాష అభినవ్, కలెక్టర్, నిర్మల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

- 122మంది విద్యార్థుల గైర్హాజరు



జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్: జిల్లాలోని సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలతో పాటు 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ కోసం ఈ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు నిర్వహించారు. గంట ముందుగానే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మొత్తం 6,034 మంది విద్యార్థులకు గాను 5,912 మంది హాజరు కాగా, 122 మంది హాజరు కాలేదు. ఐదో తరగతిలో ప్రవేశానికి 4,276 మంది విద్యార్థులకు గాను 4,210 మంది హాజరు కాగా 66 మంది గైర్హాజరయ్యారు. ఆరో తరగతిలో 727 మందికి గాను 706 మంది హాజరు కాగా, 21 మంది పరీక్ష రాయలేదు. ఏడో తరగతిలో 418 మందికి గాను 399 మంది హాజరు కాగా, 19 మంది గైర్హాజరయ్యారు. ఎనిమిదో తరగతిలో 326 మందికి గాను 316 మంది హాజరు కాగా, 10 మంది హాజరు కాలేదు. తొమ్మిదో తరగతిలో 287 మందికి గాను 281 మంది హాజరు కాగా, ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు.

ఘనంగా విగ్రహ ప్రాణప్రతిష్ఠ



సోన్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సోన్: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి, లోకల్ వెల్మల్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ధ్వజ, శిఖర, ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల వద్ద ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. బీజేపీ మండలాధ్యక్షుడు మారా గంగారెడ్డి, నాయకులు సరికెల గంగన్న, జక్క రాజేశ్వర్, నరేశ్, నర్సారెడ్డి, నర్సయ్య, సంతోష్, ప్రశాంత్, గంగన్న, సాయన్న, మక్కన్న, అమృత్, రాజు, ఉదయ్, శివ భక్తులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



ధర్మోరలో పూజలు చేస్తున్న రామారావు పటేల్

ధర్మోర హన్మాన్ ఆలయంలో..

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. నాయకులు సాయన్న, మెండె శ్రీధర్, మంద భాస్కర్, మంద గణేశ్, జయసాగర్‌రావు, అనిల్, ఆజోబ పటేల్, ఉత్సవ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.


జీవాలతో వలసబాట



జీవాలతో వస్తున్న కాపరులు

తానూరు: నిజామాబాద్ నుంచి నిర్మల్ జిల్లాకు గొర్రెలు, మేకల కాపరులు తమ జీవాలతో వలసబాట పట్టారు. పక్షం రోజుల క్రితం ఇంటి నుంచి బయలుదేరిన వీరు తానూరు, ముథోల్, కుభీర్ మండలాల్లోని ఆయా గ్రామాల శివారులో పంట పొలాల్లో జీవాలను మేపుతున్నారు. రాత్రి వేళ రైతుల పొలాల్లో మంద పెడుతున్నారు. ఇందుకు గాను రైతులు ఒకరోజుకు రెండు అడ్డల బియ్యం, రూ.200 ఇస్తున్నట్లు వారు చెబుతున్నారు. తమ ప్రాంతంలో మేత లేకనే జీవాలతో జిల్లాకు వలస వచ్చినట్లు వారు తెలిపారు.

విద్యార్థులకు ఐ కేర్..!



భైంసా ఏరియాస్పత్రిలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు (ఫైల్)

- దృష్టిలోపం నివారణే లక్ష్యంగా కార్యక్రమం అమలు
- జిల్లావ్యాప్తంగా స్టూడెంట్లకు కంటి పరీక్షలు

భైంసాటౌన్: విద్యార్థుల్లో దృష్టిలోపం నివారణే లక్ష్యంగా జిల్లా వైద్యారోగ్య శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఏటా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అవసరమైనవారికి మందులు అందిస్తున్నారు. అయితే, ఈసారి తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఆదేశాల మేరకు 5 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు ఆప్తాల్మజిస్ట్ ఆధ్వర్యంలో మరోసారి పరీక్షలు జరిపి కంటి అద్దాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి అద్దాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో...

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. వీరు పాఠశాలస్థాయిలో ఆప్తోమెట్రిస్ట్‌లతో 1,385 మంది విద్యార్థులను పరీక్షించారు. వీరిలో దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు మళ్లీ పరీక్షలు చేస్తున్నారు. విద్యార్థుల్లో కంటి సమస్యలు పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ముందుకెళ్తున్నారు. ఇప్పటికే దృష్టిలోపం ఉన్న విద్యార్థులను ఆర్బీఎస్‌కే వాహనాల్లో జీజీహెచ్, భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించి పరీక్షిస్తున్నారు. కార్యక్రమం 15 రోజులు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

447 మందికి కంటి అద్దాలు

దృష్టిలోపమున్న విద్యార్థులకు ఈనెల 17 నుంచి జిల్లాకేంద్రంలోని జీజీహెచ్‌తోపాటు భైంసాలోని ఏరియాస్పత్రిలో మరోసారి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 448 మంది విద్యార్థులు దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో 447 మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించారు. మార్చి మొదటివారం వరకు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్నాం

ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో జీజీహెచ్‌లో కంటి వైద్యులతో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. లోపాలు ఉన్న వారిని గుర్తించి వైద్యం అందిస్తున్నాం. 448 మంది విద్యార్థులకు దృష్టిలోపమున్నట్లు గుర్తించాం. కంటి అద్దాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– నయనరెడ్డి, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం జిల్లా అధికారి

ఆరోగ్య కిట్లు అందేదెప్పుడో..!

- ప్రభుత్వం నుంచి నిలిచిన సరఫరా
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు



లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే బాలికల ఆరోగ్యాన్ని కాపాడేందుకు గత ప్రభుత్వం శానిటరీ హెల్త్ అండ్ హైజెనిక్ కిట్లు పంపిణీ చేసింది. 2018–19 విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా ప్రతీ మూడు నెలలకోసారి కిట్లు అందించింది. ఏడాదిన్నర కాలం సజావుగా సాగిన ఈ కార్యక్రమం తర్వాత నిలిచిపోయింది. నాలుగేళ్లుగా విద్యార్థినులకు కిట్లు అందించడం లేదు. దీంతో బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థినులతోపాటు పోషకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

8,9,10 తరగతుల నుంచి..

గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8,9,10 తరగతులతోపాటు ఇంటర్ విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్స్, సబ్బులు, కొబ్బరి నూనె, షాంపు బాటిల్, టూత్ పేస్ట్, బ్రష్, పౌడర్ తదితర 15 రకాల వస్తువులు కలిగిన హెల్త్ కిట్లను అందజేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏడాదిన్నర కాలం సజావుగా కిట్లు అందజేసింది. అనంతరం కరోనా కారణంగా పాఠశాలలకు సెలవులు రావడంతో హెల్త్ కిట్ల పంపిణీ నిలిచింది.

విద్యార్థినుల వివరాలు

జిల్లాలో 164 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతిలో 2,855 మంది విద్యార్థినులు, తొమ్మిదో తరగతిలో 2,835 మంది, 10వ తరగతిలో 2,476 మంది విద్యార్థినులు చదువుతున్నారు. జిల్లాలోని 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫస్టియర్ విద్యార్థినులు 1,013 మంది, సెకండియర్ విద్యార్థినులు 941 మంది ఉన్నారు.

అందని కాస్మొటిక్ చార్జీలు

జిల్లాలో 18 కేజీబీవీలు, 18 కళాశాలలున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరం, రెండో సంత్సరం విద్యార్థినులు 2,880 మంది ఉన్నారు. కేజీబీవీల్లో 6,7,8,9,10 తరగతుల్లో ఒక్కో తరగతికి 40 మంది చొప్పున 18 కేజీబీవీల్లో మొత్తం 3,600 బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఈ సంవత్సరం నుంచి కాస్మొటిక్ చార్జీల కింద నెలకు రూ.100 చొప్పున అందజేస్తామని చెప్పడటంతో ఎస్వోలు విద్యార్థినులతో బ్యాంక్ ఖాతాలు తీయించారు. ఈ ప్రక్రియ గత డిసెంబర్ చివరి వరకు కొనసాగిందని కేజీబీవీల ఎస్వోలు చెబుతున్నారు. విద్యార్థినుల ఖాతాల్లో నేరుగా నెలకు రూ.100 జమ అవుతున్నట్లు అధికారులు తెలిపినా ఇప్పటివరకు ఏ ఒక్క విద్యార్థినికి జమ కాలేదని ఎస్వోలు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థినులకు హెల్త్ కిట్లు, కేజీబీవీల్లో చదివే విద్యార్థినులకు కాస్మొటిక్ చార్జీలు ఇవ్వాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



కొద్ది సంవత్సరాలుగా మాకు ఆరోగ్య కిట్లు ఇవ్వడంలేదు. దీంతో బయట కొనుగోలు చేస్తున్నాం. దీంతో మాకు ఆర్థికంగా ఇబ్బంది అవుతోంది. కొందరు కొనుక్కోలేకపోతున్నారు. వారు అనారోగ్యానికి గురవుతున్నారు.

– మేఘన, విద్యార్థిని, వడ్యాల్ హైస్కూల్

వెంటనే కిట్లు ఇవ్వాలి



విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే హైజెనిక్ కిట్లు సరఫరా చేయాలి. ఇంతకుముందు లాగే మూడు నెలలకోసారి పంపిణీ చేయాలి. మా ఆరోగ్య రక్షణకు సర్కారు తోడ్పటునందించాలి.

– దీక్షిత, విద్యార్థిని, పార్‌పెల్లి హైస్కూల్

కిట్లతో విద్యార్థినులకు మేలు



గతంలో ప్రభుత్వం సరఫరా చేసే హైజెనిక్ కిట్లలో 15 రకాల వస్తువులుండేవి. అవి విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి నుంచైనా వాటిని సరఫరా చేయాలి. వీటితో విద్యార్థినులకు ఎంతో మేలు జరుగుతుంది.

– రామారావు, డీఈవో, నిర్మల్

వాలా దశాబ్ది ఉత్సవాలు

నిర్మల్‌టౌన్: నిర్మల్ వాకర్స్ అండ్ లాఫింగ్ అసోసియేషన్ (వాలా) దశాబ్ది ఉత్సవాలను ఆదివారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్, చెస్, వాలీబాల్, క్యారమ్స్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాలం శ్రీనివాస్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న వాలా సభ్యులు



క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

నర్సాపూర్ (జి): మండల కేంద్రం శివారు 61వ జాతీయ రహదారిపై బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన జంగ్మె సంతోష్, గౌతమ్ బైక్‌పై నిర్మల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా నర్సాపూర్ (జి) గ్రామ శివారులో 61వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సంతోష్ ఆదివారం ఉదయం మరణించాడు. గౌతమ్ చికిత్స పొందుతున్నాడు. సంతోష్ అన్న కాశీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మందమర్రిలో బైక్ అదుపుతప్పి..

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని యాపల్ ఏరియాకు చెందిన షేక్ ముగ్దుం, షేక్ జిలానీ అన్నదమ్ములు. ఏరియాలోని కేకే ఓసీలో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఆదివారం పని నిమిత్తం బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి.. తిరిగి బెల్లంపల్లిలోని వాళ్ల మేనమామ ఇంటికి బయల్దేరారు. బైక్ అదుపుతప్పి కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీకొన్నారు. బైక్ నడుపుతున్న జిలానీ(30) అక్కడికక్కడే మృతిచెందగా, ముగ్దుం తీవ్రగా గాయపడ్డాడు. అతడిని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..



సంతోష్ (ఫైల్)

కుభీర్: మండల కేంద్రానికి చెందిన సిందే సంతోష్ (30) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న సంతోష్ తన అత్తగారి ఊరైన భైంసా మండలం సిద్దూరుకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి సాయంత్రం వస్తుండగా సిద్దూరు దాటగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో కిందపడ్డాడు. తల పగిలి తీవ్ర రక్తస్రావం కాగా, వెంటనే కుటుంబీకులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం హైదారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడున్నారు.

నాటు కోళ్లు మృత్యువాత

భీమారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో పెంచుతున్న 50 నాటు కోళ్లు అంతు చిక్కని వ్యాధితో మృతి చెందాయి. కాలనీలో సాయికుమార్ స్వయం ఉపాధి కోసం తెచ్చి పెంచుతున్న 20 కోళ్లు ఆదివారం మృతి చెందగా, అంతకుముందు మరో 30 మరణించాయని తెలిపారు. ఇవే కాకుండా చాలా మంది ఇళ్లలో పెంచుతున్న కోళ్లు కూడా మరణిస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [M-SCA25001809]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA25001803]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

ప్రాచీన కళకు ప్రాణం

- చిరుతల రామాయణం సాధనలో గ్రామీణులు
- నిష్ఠతో నేర్చుకుంటున్న కాచన్‌పల్లి కళాకారులు
- ప్రదర్శనతో భావితరాలకు మన సంస్కృతి



కాచన్‌పల్లిలో చిరుతల రామాయణం సాధన చేస్తున్న కళాకారులు



చిరుతల రామాయణంలో ఓ సన్నివేశం(ఫైల్)

చెన్నూర్‌రూరల్: టీవీలు వచ్చాక.. ప్రాచీన కళలకు ఆదరణ తగ్గింది. సెల్‌ఫోన్ ఆవిష్కరణ చూసేవారు తగ్గిపోయారు.. ఆన్‌డ్రాయిడ్ ఫోన్ అరచేతిలోకి వచ్చాక పరిస్థితి మరింత దిగజారింది. కళను చూసేవారే కాదు.. కళను పోషించేవారు తగ్గిపోతున్నారు. ఇలాంటి పరిస్థితిలో చెన్నూర్ మండలంలోని పలు గ్రామాల కళాకారులు చిరుతల రామాయం రక్షణకు శ్రీకారం చుట్టారు. రామాయణంలోని వివిధ పాత్రలు పోసించేందుకు శిక్షణ పొందుతున్నారు. తర్వాత ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం కాచన్‌పల్లి వాసులు నెల రోజులుగా నిష్ఠతో సాధన చేస్తున్నారు.

నిష్ఠగా ఉంటేనే..

పల్లె కళాకారులకు గురువు చిరుతల రామాయణంలో సన్ని వేశాలు, మాటలు, పద్యాలలో శిక్షణ ఇస్తారు. ఇందులో అన్ని ప్రాతలు చేసేందుకుగాను సుమారు 25 మంది కళాకారులు శిక్షణ పొందుతారు. రామాయణంలో సన్నివేశాలు నేర్చుకునే సమయంలో నియమ, నిష్ఠలతో ఉంటారు. సుమారు నెల నుంచి రెండు నెలలు సాధన చేస్తారు. ఆ సమయంలో మద్యం, మాంసం ముట్టరు. తర్వాత ఎంపిక చేసిన గ్రామాల్లో చిరుతల రామాయణం ప్రదర్శిస్తారు.

సాధన, ప్రదర్శన రాత్రివేళలోనే..

ఇక చిరుతల రామాయణం సాధన, ప్రదర్శన రెండూ రాత్రి వేళలలోనే ఉంటాయి. ఉదయం రోజువారీ పనులకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు రాత్రి సమయాన్నే ఎంచుకుంటున్నారు. సాధన చేసేవారిలో రైతులు, కూలీలు, ప్రజాప్రతినిధులు కూడా ఉంటున్నారు.

వారం రోజులు ప్రదర్శన..

చిరుతల రామాయణం ప్రతీ గ్రామంలో వారం రోజులు ప్రదర్శిస్తారు. ఇందులో ఆరు ఘట్టాలు ఉంటాయి. మొదటగా ఆయోధ్యకాండ, బాలకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండ ఉంటాయి. రోజుకు ఒక కాండ చొప్పున ప్రదర్శిస్తుంటారు. బాల రాముడి నుంచి పట్టాభిషేకం వరకు ప్రదర్శన ఇస్తారు. ఈ ప్రదర్శనకు సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కళాకారులు ఒక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేసుకుంటారు. అలాగే గ్రామంలోని వారు ఇంటికి కొంత డబ్బులు చందా జమ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో చిరుతల రామాయణ ప్రదర్శన కొనసాగుతాయి.

మూడుసార్లు శిక్షణ ఇచ్చా..



చిరుతల రామాయణం అంటే ప్రాచీన కళ, సనాతన ధర్మాన్ని కాపాడేది. నేను మా పెద్దల వద్ద నేర్చుకున్నాను. పాత్రలు కూడా పోషించాను. ఇప్పటి వరకు నేను చిరుతల రామయణంపై మూడుసార్లు శిక్షణ ఇచ్చాను. మా గ్రామంలో మార్చి 25 నుంచి చిరుతల రామాయణం ప్రదర్శన ఉంది.

– గోదరి రాజయ్య, శిక్షకుడు, కాచన్‌పల్లి

రాముని పాత్ర పోషించడం అదృష్టం



నేను మా ఊరిలో నిర్వహించే చిరుతల రామాయణం ప్రదర్శనలో రాముని పాత్ర కనిపించబోతున్నాను. రాముని పాత్ర పోషించడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రతీరోజు రాత్రి ప్రాక్టీస్ చేస్తున్నాం.

–నరిగె రాజబాపు, కాచన్‌పల్లి, కళాకారుడు

లక్ష్మణుని పాత్ర చేస్తున్నాను



ఎంతో నియమ, నిష్ఠలతో ఉండి చిరుతల రామాయణం నేర్చుకుని ప్రదర్శిస్తాం. నేను మా ఊరిలో నిర్వహించే చిరుతల రామాయణం ప్రదర్శనలో లక్ష్మణుని పాత్ర చేస్తున్నాను. ప్రతీరోజు రాత్రి సమయంలో ప్రాక్టీస్ చేస్తున్నాం.

– తిరుపతి, కాచన్‌పల్లి, కళాకారుడు

ఆంజనేయుని వేషధారణ



ప్రతీరోజు రాత్రి సమయంలో ప్రాక్టీస్ చేస్తున్నాం. ఆంజనేయుడి పాత్ర పోషిండచం అదృష్టంగా భావిస్తున్నా. ఎంతో నియమ, నిష్ఠలతో ఉండి చిరుతల రామాయణం నేర్చుకుంటున్నాం.

– లింగయ్య, కాచన్‌పల్లి, కళాకారుడు

విభీషణుని పాత్ర..



నేను మా ఊరిలో నిర్వహించే చిరుతల రామాయణంలో విభీషణుని పాత్ర పోషించబోతున్నాను. 20 రోజుల నుంచి శిక్షణ పొందుతున్నాం. వచ్చే నెలలో ప్రదర్శన ఉంటుంది.

–నరిగె లింగయ్య, కాచన్‌పల్లి, కళాకారుడు, మాజీ సర్పంచ్

బాసరలో భక్తుల రద్దీ



క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో చిన్నారులకు అర్చకులతో అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు చేయించారు. మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్లనూ దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు ఆలయాధికారులు తెలిపారు.

అమ్మవారి ఒక్కరోజు ఆదాయం

ఆదివారం మాఘమాసం శుభముహూర్తం కావడంతో సరస్వతీ అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకోగా వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.15.46లక్షల ఆదాయం సమకూరింది. రూ.500 అభిషేకాల ద్వారా రూ.70,500, రూ.వెయ్యి అక్షరాభ్యాస టికెట్ల ద్వారా రూ.7.76లక్షలు, రూ.150 అక్షరాభ్యాసాల ద్వారా రూ.46,500, రూ.100 మండప ప్రవేశం ద్వారా రూ.85వేలు, రూ.50 మండప ప్రవేశం ద్వారా రూ.12వేలు, అభిషేకం లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2.94లక్షలు, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.2.62లక్షలు ఆదాయం వచ్చింది.

సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రికి వినతి



వినతిపత్రం ఇస్తున్న 'సమగ్ర' ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమక్షంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. పేస్కేల్ అములు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే చర్యలు చేపడతామని పేర్కొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పడాల రవీందర్, ప్రియాంక, కవిత, దేవదర్శన్, అర్చన, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని రిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలిసి ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి పేస్కేల్ ఇప్పించే విధంగా చూడాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏటా రూ.వెయ్యి ఇంక్రిమెంట్ కల్పించాలని, వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, ఉద్యోగి సర్వీసులో మరణిస్తే కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, మహిళలకు ప్రసూతి సమయంలో వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బండ శ్రీనివాస్, రవి, రాజు, సంతోష్, జ్ఞానేందర్, శైలేందర్, రవికిరణ్ యాదవ్, ఫేరోజ్, తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీజీఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్



చైర్మన్‌ను గజమాలతో సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు, సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అటవీశాఖ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. టీఎన్జీవోస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఎన్జీఓ ఫారెస్ట్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య, కాళేశ్వరం జోనల్ సెక్రటరీ సుభాష్, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్, కవ్వాల్ సర్కిల్ రెప్రజెంటేటీవ్ అజర్, అటవీ శాఖ ఉద్యోగ నాయకులు ఆయనను గజమాలతో సత్కరించారు. సిరిసిల్ల పద్మశాలి నేతలతో నేసిన అగ్గిపెట్టెలో పట్టే పట్టు వస్త్రాలను బహూకరించారు. అనంతరం అటవీ శాఖలో ఖాళీగా ఉన్న ఎఫ్‌బీవో పోస్టులను భర్తీ చేయాలని, పోలీస్ శాఖలో వర్తిస్తున్న జీతభత్యాలు అటవీ శాఖలోని యూనిఫాం ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని, పదన్నతులు కల్పించాలని, ఫారెస్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. స్పందించిన మారం జగదీశ్వర్ జూనియర్ అటవీ ఉద్యోగుల సమస్యలతోపాటు అందరి సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు, టీఎన్జీవోస్ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాటరీ లైట్లతో వన్యప్రాణుల వేట



పట్టుకున్న నిందితుడితో ఎస్సై శ్యాంపటేల్

వేమనపల్లి: బ్యాటరీ లైట్ల సహాయంతో వన్యప్రాణులను వేటాడుతున్న ఒకరిని నీల్వాయి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్యాంపటేల్ తెలిపిన వివరాల ప్రకారం.. కల్మలపేట గ్రామానికి చెందిన తోకల జీవన్ కొంత మందితో కలిసి కోటపల్లి మండలం నక్కలపల్లి, చామనపల్లి అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులను వేటాడుతున్నారు. బ్యాటరీ చార్జింగ్ పెట్టి లైట్లు దానికి అనుసంధానం చేసి అటవీ ప్రాంతంలో రాత్రిపూట వన్యప్రాణులను లైట్ వెలుతురు సహాయంతో ట్రాక్ చేసి చంపేస్తున్నారు. పక్కా సమాచారంతో నీల్వాయి ఎస్సై ఆదివారం తెల్లవారుజామున నీల్వాయి బస్టాండ్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న జీవన్‌ను పట్టుకున్నాడు. అతడిని తనిఖీ చేయగా అడవి పిల్లి, కుందేలు, జింక కాళ్లు, తల, మాంసం లభ్యమయ్యాయి. బ్యాటరీలు చార్జింగ్ లైట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని నీల్వాయి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వేటాడినవారిలో జీవన్‌తోపాటు కల్మలపేట గ్రామానికి చెందిన ఉండ్రాళ్ల పోశం, ఇంకా కొంత మంది ఉన్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కెట్టిపేట గ్రామానికి చెందిన ఉప్పు నర్సయ్య వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం పంట పొలానికి వెళ్లారు. విద్యుదాఘాతంతో ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న బంగారం, నగదు, నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి, వ్యవసాయ పనిముట్లు కాలిపోయాయి. రూ.10లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉట్నూర్‌రూరల్: బాధిత కుటుంబాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరామర్శించారు. కుటుంబ సభ్యులను అడిగి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తనవంతుగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. నాయకులు ఖయ్యూం, దాసండ్ల ప్రభాకార్, తదితరులు ఉన్నారు.

అ'పూర్వ'ం.. ఆత్మీయం



నస్పూర్ పట్టణ పరిధిలోని సీసీసీ సింగరేణి హైస్కూల్‌లో 1999–2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సీసీసీలోని బొమ్మరిల్లు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు జక్కుల మల్లేశ్, తొట్ల బుచ్చన్న, కారుకూరి రవీందర్, శ్రీనివాస్ శర్మ, ధనలక్ష్మి, రమాదేవి, రేఖాఠాగూర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

– నస్పూర్

బాలిక తండ్రిపై బాలుడి హత్యాయత్నం

- ప్రేమపెళ్లికి నిరాకరించాడని ఘాతుకం
- చికిత్స పొందుతున్న బాలిక తండ్రి
- వివరాలు వెల్లడించిన నిర్మల్ ఏఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

నిర్మల్‌టౌన్: తాను ప్రేమించిన బాలికతో పెళ్లికి నిరాకరించిన ఆమె తండ్రిపై పగ పెంచుకున్న ఓ బాలుడు అతడిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా ఆదివారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఓ బాలుడు జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ కార్యాలయం వద్ద గల డబుల్ బెడ్రూం ఇంటిలో నివసించే ఓ బాలికను ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని ఆమెతో చెప్పగా పెళ్లీడు వచ్చేదాకా ఆగాలని ఆ బాలిక బదులిచ్చింది. దీంతో ఆ బాలుడు నేరుగా బాలిక తండ్రి అబ్దుల్ అజీజ్ వద్దకే వెళ్లి 'మీ కూతురును ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటాను' అని చెప్పాడు. బాలిక తండ్రి కూడా పెండ్లీడు వచ్చాకే పెళ్లి చేస్తానని చెప్పాడు. ఈ విషయం నచ్చని బాలుడు అజీజ్‌పై కోపం పెంచుకున్నాడు. ఎలాగైనా అతడిని చంపాలని పథకం పన్నాడు. మొహమ్మద్ తౌసిఫ్ ఉల్ల సహకారం తీసుకుని ఈనెల 22న రాత్రి 10.45గంటలకు సదరు బాలిక ఇంటికి వెళ్లాడు. వెంట తెచ్చుకున్న కత్తెరతో బాలిక తండ్రి కడుపులో పొడిచాడు. ఈ ఘటన నుంచి తప్పించుకున్న అబ్దుల్ అజీజ్‌ను స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు హత్యాయత్నానికి కారకులైన బాలుడితోపాటు సహకరించిన మొహమ్మద్ తౌసిఫ్‌ను పోలీసులు 24 గంటల్లో చాకచక్యంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ రాజేశ్‌మీనా, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన హంపోలి ప్రభాకర్‌రెడ్డి (42) మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మాలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభాకర్‌రెడ్డి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తిచెంది శనివారం రాత్రి తన పంట పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి..

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ- వేంపల్లి గ్రామాల మధ్య అటవీప్రాంతంలో గల భీమన్న ఆలయ సమీపంలో ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పోచమ్మబస్తీ కాలనీకి చెందిన మామిడి వెంకటేశ్(35) ఆలయ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని ఎస్సై తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న నలుగురి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

ఇంద్రవెల్లి: జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని దుర్గనగర్‌కు చెందిన సుక్‌దేవ్ అలియస్ సన్ని (25), రాన్‌మలే గజానంద్ అలియాస్ కిరణ్ (21), టెంబుల్‌కర్ కృష్ణ (20), బక్కలే ఆకాశ్ (19) ఈ నెల 21న ఇంద్రవెల్లి మండలంలోని ఈశ్వర్‌నగర్ జై దుర్గవైన్స్‌తో పాటు ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న రెండు వైన్‌షాపుల్లో, నార్నూర్ మండలంలోని రెండు కిరాణ షాపుల్లో, గాదిగూడ మండలంలోని లోకరి వైన్‌షాపులో చోరీకి పాల్పడ్డారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు ఆదివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు వెళ్తున్న నలుగురు యువకులను పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద ద్విచక్రవాహనంతో పాటు రూ.2,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. గతంలో తలమడుగు మండల కేంద్రంలోని కిరాణ షాపుతో పాటు జగిత్యాలలో కూడా దొంగతనం చేసినట్లు తెలిపారు. ఆదివారం కూడా దొంగతనం చేయడానికి ముందస్తు రెక్కీ కోసం ఉట్నూర్ వైపు వెళ్తుండగా పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రమేశ్, కానిస్టేబుళ్లు సాయికిరణ్, హరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వివాహిత ప్రేమాయణం

- న్యూడ్ కాల్ చేయాలని బ్లాక్‌మెయిల్ చేసిన నిందితుడు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో యువత కొత్త పుంతలు తొక్కుతోంది. కొంతమంది మితిమీరిన పరిచయాలు పెంచుకుని ప్రేమాయణంతో పాటు అక్రమ సంబంధాలు కొనసాగిస్తున్నారు.. ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సు నీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఓ వివాహితకు ఈస్ట్ గోదావరి జిల్లా రాజోల్ మండలం మొర్కపాలెంకు చెందిన బీఫార్మసీ విద్యార్థి నందుల ఆనంద్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. అప్పుడప్పుడు వీడియో కాల్‌చేసి మాట్లాడుకునేవారు. అయితే నిందితుడు వీడియో కాల్ చేసే సమయంలో స్క్రీన్‌షార్ట్ తీసుకునేవాడు. న్యూడ్ కాల్ చేయకపోతే వాటిని సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. ఆమె భయపడి న్యూడ్ కాల్ చేయడంతో వాటిని స్క్రీన్‌షార్ట్ తీ సుకొని తనవద్ద ఉంచుకున్నాడు. శారీరకంగా తనను కలవాలని, లేనట్లయితే సోషల్ మీడియాలో వాటిని పోస్టు చేస్తానని భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో సదరు మహిళ ఈనెల 4న వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు నిందితుడిని ఆమె ద్వారా అక్కడి నుంచి పిలిపించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. రెండు నెలల క్రితం ఆదిలాబాద్‌కు చెందిన ఓ మైనర్ విద్యార్థినికి హైదరాబాద్‌కు చెందిన యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. తర్వాత ఇంట్లో ఎవరికి చెప్పకుండా అతనితో వెళ్లిపోయింది. పోలీసులు ట్రాప్ చేసి పట్టుకొని నిందితుడిని కటకటాల పాలు చేశారు. సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకొని ప్రేమ పేరిట యువత తప్పుదోవ పడుతున్నారని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.